పనులు పూర్తికాకుండానే ఫ్లైఓవర్ ప్రారంభమా?

● ఇక్కడి ఓట్లతో గెలిచిన కిషన్‌రెడ్డికి ప్రజల ఇబ్బందులు పట్టవా?

● సర్వీసు రోడ్లనూ పూర్తి చేయలేదు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేష్ చిత్రంలో కార్పొరేటర్లు విజయ కుమార్‌గౌడ్, పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంకటరెడ్డి

గోల్నాక, మే 4 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు పూర్తికాకుండా అస్తవ్యస్తంగా పరిస్థితుల్లో ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తే ప్రజలు ఎలా హర్షిస్తారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఫ్లైఓవర్ కింద పనులన్నీ వదిలేస్తే ప్రజలకు ఇబ్బందులు ఎలా తీరుతాయన్నారు. ఇప్పటికీ సర్వీసు రోడ్లు పూర్తికాక ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తుంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అవేవీ పట్టకుండా సోమవారం ఫ్లైఓవర్‌ను కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీచే ప్రారంభోత్సవానికి పూనుకోవడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఆదివారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలేరు వెంకటేష్ కార్పొరేటర్లు ఇ.విజయకుమార్‌గౌడ్, బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డితో కలిసి మాట్లాడారు. కేంద్రమంత్రిగా వ్యవహరిస్తున్న కిషన్‌రెడ్డికి అంబర్‌పేట ప్రజల ఇబ్బందులు ఎందుకు తెలియడం లేదన్నారు. ఈ విషయంలో ఆయన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

● ఫ్లైఓవర్ ఆది నుంచి ఫ్లైఓవర్ ఎండ్ వరకు సర్వీసు రోడ్ల దుస్థితి అస్తవ్యస్తంగానే ఉందన్నారు. 2018 మేలోనే అప్పటి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ ఈఫ్లైఓవర్ పనులకు శంకుస్థాపన చేశారని, అప్పటి నుంచి ఫ్లైఓవర్ పనులు పూర్తి కావడానికి ఏడేళ్లు పట్టిందన్నారు. ఇంకా పనులు పూర్తి కాలేదన్నారు. ఈ ఫ్లైఓవర్‌ను మళ్లీ కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ప్రారంభిస్తుండడంతో అన్ని వాస్తవాలు ఆయన దృష్టికి తీసుకరావడం కోసమే ఈ విలేకరుల సమావేశం పెట్టి వివరిస్తున్నామన్నారు.

● ఈఫ్లైఓవర్ వెంట వివిధ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న రోడ్ల వద్ద మూడు ఫీట్ల ఎత్తు రోడ్లు వేయడంలో వర్షాలు వస్తే ఆ ప్రాంతాలు నీట మునగనున్నాయన్నారు. ఈ ఫ్లైఓవర్ వరంగల్, భువనగిరి తదితర దూరప్రాంతాలకు వెళ్లేవారికి ప్రయోజనంగా ఉంది కానీ, అంబర్‌పేట ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. అంబర్‌పేట ప్రజల ఓట్లతోనే గెలుస్తున్న కిషన్‌రెడ్డికి వారి ఇబ్బందులు పట్టవా అన్నారు. ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి సంబంధించి ఇప్పటి వరకు తనకు కానీ, కార్పొరేటర్లకు కానీ ఎలాంటి ఆహ్వానం, సమాచారం లేదని ఎమ్మెల్యే విలేకరులకు చెప్తుతుండగా అప్పుడే హైదరాబాద్ కలెక్టర్ ఎమ్మెల్యేకు ఫోన్ చేసి 'రేపు ఫ్లైఓవర్‌ను నితిన్‌గడ్కరీ ప్రారంభిస్తున్నారని, మీరు పాల్గొనాలి' అని ఆహ్వానించారు. స్థానిక కార్పొరేటర్లకు కూడా ఆహ్వానించాలని ఎమ్మెల్యే కలెక్టర్‌కు సూచించారు. అన్ని పనులను పూర్తి చేసి ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తేనే బాగుంటుందని, ప్రారంభించాక సర్వీసు రోడ్ల పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. రేపు జరిగే కార్యక్రమంలో తాము పాల్గొని ప్రజల ఇబ్బందులు కేంద్రమంత్రి దృష్టికి తీసుకవస్తామని ఆయన చెప్పారు.

'గడ్కరీ పర్యటనను జయప్రదం చేయాలి'

బర్కత్‌పుర, మే 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పర్యటనను జయప్రదం చేయాలని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు కోరారు. ఈనెల 5న నితిన్ గడ్కరీ రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని, నగరంలో భారీ స్వాగతం పలుకడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆదివారం బర్కత్‌పురలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి నితిన్ గడ్కరీ అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను అధికారికంగా ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి గత పదేళ్లల్లో మోదీ ప్రభుత్వం రూ.31 వేల కోట్లకు పైగా నిధులను కేటాయించిందన్నారు. నగరంలో నిర్మించిన పలు ఫ్లైఓవర్లను కూడా ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డాక్టర్ గౌతమ్‌రావు తదితరులు

సభ ఏర్పాట్లను పరిశీలించిన బీజేపీ నేతలు

అంబర్‌పేట, మే 4 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మున్సిపల్‌గ్రౌండ్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ బహిరంగ సభ ఏర్పాట్లను బీజేపీ నేతలు ఆదివారం పరిశీలించారు. అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన తర్వాత నితిన్ గడ్కరీ అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారు. కేంద్రమంత్రులు గడ్కరీ, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ బహిరంగసభలో పాల్గొంటారని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాట్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులతో కలిసి పరిశీలించారు. సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సి.కృష్ణగౌడ్, ఏదెల్లి అజయ్‌కుమార్, నాగభూషణంచారి, నరేష్‌గౌడ్, నాగరాజుచారి తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ముషీరాబాద్‌లో ప్రశాంతంగా నీట్

ముషీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం చేపట్టిన నీట్ పరీక్ష ఆదివారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి బారులు తీరి వెళ్లారు. విద్యార్థుల వద్ద ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలు పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. 240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ముందుజాగ్రత్త చర్యగా పరీక్షాకేంద్రం వద్ద ముషీరాబాద్ సీఐ రాంబాబు, ఎస్సై రాజేష్, పోలీస్ బందోబస్తు నిర్వహించారు. భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

'కాకతీయ' విద్యార్థులకు సత్కారం



పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ సీతారామిరెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కాకతీయ విద్యా సంస్థల విద్యార్థులు సత్తాచాటారు. ఈ నేపథ్యంలో ఆదివారం సంస్థ ప్రాంగణంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ పి.సీతారామిరెడ్డి సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసశర్మ, డి.రాజేశ్వర్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ పి.శ్వేతారెడ్డి, శ్రద్ధ ఠాకూర్, డైరెక్టర్ గోక నవీన్ (రాంనగర్ బ్రాంచ్), ప్రిన్సిపాల్ రామరాజు, సీఈవో పి.శ్రీకాంత్‌రెడ్డి, జోనల్ హెడ్ రమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

చిక్కడపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి శారద సంగీత సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన నాడు-నేడు తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని... కన్నులలో దాచుకొందు నిన్నే నా స్వామి నిన్నే నా స్వామి... శీర్షికతో ప్రముఖ గాయకుడు టి.గోవిందరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. నిర్వాహకుడు, గాయకుడు వీఎస్ సుందరరావు, లక్ష్మీశైలజ, శేషసాయి, వాణి, వర్ధిని, గాయత్రి, వసంత, దీప్తి, మానస తదితరులు గీతాలు ఆలపించారు. సూర్యతేజ, చక్రవర్తి, సతీష్ వాద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వీఎస్ సుందరరావు దంపతులను ఎస్‌బీఐ మాజీ ఏజీఎం త్రినాథరావు, ప్రముఖ గాయకుడు చంద్రతేజ సత్కరించారు.

న్యూఅచ్చయ్యనగర్ బస్తీ అధ్యక్షుడిగా బాబుగౌడ్



రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని న్యూఅచ్చయ్యనగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడుగా బస్తీ సీనియర్ నాయకుడు, బీజేపీ ఓబీసీ మోర్చా మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి ఏజే.బాబుగౌడ్ నియమితులయ్యారు. ఆదివారం బస్తీకమిటీ చైర్మన్ పి.యాదగిరి అధ్యక్షతన బస్తీ కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా బాబుగౌడ్‌ను ఎన్నుకున్నారు. దీంతో చైర్మన్ యాదగిరి అధికారికంగా బాబుగౌడ్‌ను ప్రకటించారు.

6న ఉచిత ఆస్తమా వైద్య శిబిరం

ముషీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో ఈనెల 6న ఉచిత ఆస్తమా అవగాహన, వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ భారతి తెలిపారు. ఆదివారం ముషీరాబాద్ కేర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఉదయం 6గంటల నుంచి సాయత్రం 4 వరకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు భారతి తెలిపారు. నగరంలో 10 మంది పిల్లల్లో ఒకరికి, ప్రతి 12మంది పెద్దల్లో ఒకరికి ఆస్తమా ఉంటుందని తెలిపారు.

'దళిత యువకుడిపై దాడి అమానవీయం'

నల్లకుంట, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సిద్ధిపేట జిల్లా చేర్యాల మండలం వెచరేణి గ్రామంలో దళిత యువకుడిపై జరిగిన దాడి అమానవీయ క్రూరత్వం అని, రాష్ట్రంలో మత, కుల ఉగ్రవాదం విజృంభిస్తోందని, ఇలాంటి సంఘటనలు ఇందుకు నిదర్శమని తెలంగాణ రాష్ట్ర దళితసేన మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి పేర్కొన్నారు. బీజేపీ అనుబంధ సంస్థలు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, ఆర్‌ఎస్ఎస్ నాయకులు శ్రీఆంజనేయస్వామి ఆలయంలోకి వెళ్లి ఓ మతిస్థిమితం లేని దళిత యువకుడిపై నడిరోడ్డుపై విచక్షణారహితంగా దాడి చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ దాడికి పాల్పడిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్‌గూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలనలో దళితుల ప్రాణాలు, గౌరవానికి, హక్కులకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. మతిస్థిమితం లేని అజయ్‌కుమార్‌పై దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో దాడికి గురైన దళిత యువకుడికి సరైన వైద్యం, రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



అభివాదం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్స్ ఐక్యకార్యాచరణ సమితి చైర్మన్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్స్ ఐక్య కార్యచరణ సమితి చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి ఏలూరు శ్రీనివాస్ ప్రకటించారు. ఈ నెల 15న ప్రభుత్వ కార్యాలయాల వద్ద నల్లా బ్యాడ్జీలతో నిరసన, జూన్ 9న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేస్తామన్నారు. పెన్‌డౌన్, మానవ హారం, అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద సామూహిక భోజనాలు చేస్తామని ప్రకటించారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఐక్యకార్యచరణ సమితి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను, బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్‌సీ కమిటీ నివేదికను ప్రభుత్వానికి సమర్పించి 51 శాతం ఫిట్‌మెంట్‌ను అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 57 డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఐక్యజేఏసీ అదనపు కార్యదర్శి పి.దామోదర్‌రెడ్డి, కో-చైర్మన్‌లు చావా రవి, రవీందర్‌రెడ్డి, జి.సదానందన్‌గౌడ్, దాస్యనాయక్, తిరుపతి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లింగారెడ్డి, వైస్‌చైర్మన్‌లు ముజీబ్, చంద్రమోహన్, అంజిరెడ్డి, కృష్ణయాదవ్, రామారావు, శ్రీధర్, నరహరి, చంద్రశేఖర్, తిప్పర్తి యాదయ్య,రామారావు, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టే దేశ వ్యాప్త కులగణన సర్వే వల్ల దేశంలోని అన్ని కులాలకు జనాభా ప్రాతిపదికన రాజ్యాంగ ఫలాలు లభిస్తాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు పేర్కొన్నారు. జనగణనలో కులగణనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తూ అడిక్‌మెట్ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో రాంనగర్ మీ సేవా వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీశంకర్, నాయకులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు దళితరత్న అవార్డు ప్రదానం

చిక్కడపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ వివేక్‌నగర్ బస్తీ కార్యదర్శి కంది సుబ్బారావును షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ వారు దళితరత్న అవార్డుతో సత్కరించారు. ఆదివారం సాయంత్రం బస్తీలో జరిగిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజువస్తాద్, నగర అధ్యక్షుడు నవీన్ సుబ్బారావుకు అవార్డును బహూకరించారు.

నేటి నుంచి అన్నమయ్య సంకీర్తన మహోయజ్ఞం

చిక్కడపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎస్ఏఎస్ఎస్‌వీ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి 11 వరకు పద కవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలు త్యాగరాయ గానసభలో నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ అనురాధదేవి కోటపాటి తెలిపారు. గురు శ్రీ వేంకటేశ్వర్లు కోటపాటి గోవింద దాస వారు స్వరపరచిన 108 అన్నమయ్య సంకీర్తనలతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

బుద్ధగయ ఆలయ చట్టాన్ని రద్దు చేయాలి

కవాడిగూడ, మే 4 (ఆంధ్రజ్యోతి): బుద్ధగయ ఆలయ చట్టాన్ని రద్దుచేయాలని, బౌద్ధుల ఆలయంలో ఇతర మతస్తుల జోక్యంలేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహాబోధి మహావీర్ లిబరేషన్ మూమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరా పార్కు నుంచి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భారతీయ బౌద్ధ మహాసభ తెలంగాణ రాష్ట్ర శాఖ సలహాదారు ప్రొఫెసర్ ధర్మపాల్, రాష్ట్ర అధ్యక్షుడు జి.పరంధాములు, ప్రధాన కార్యదర్శి జి.రాజేశ్వరరావు, మహాబోధి మహావీర్ లిబరేషన్ మూమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

13న దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టరేట్ ముట్టడి

చిక్కడపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలపై ఈనెల 13న వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అడివయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగాన్ని మార్చాలని విచ్ఛిన్నకర శక్తుల కుట్ర

ఎంపీ అనిల్ కుమార్



ముషీరాబాద్‌లో జైబాపూ, జైభీమ్, జై సమిధాన్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు

ముషీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో కొన్ని విచ్ఛిన్న శక్తులు భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేస్తున్నాయని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు. ఆదివారం ముషీరాబాద్‌లో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జైబాపూ, జైభీమ్, జై సమిధాన్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ భారత రాజ్యాంగ పుస్తకాన్ని చేతపట్టి ర్యాలీలో ముందుకుసాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ రాజకీయ దురుద్దేశంతో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుచుతూ మాట్లాడినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. భారత రాజ్యాంగాన్ని, విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ కృషిచేస్తున్నదని అన్నారు. ప్రజల్లోకి భారత రాజ్యాంగాన్ని, అంబేడ్కర్ స్ఫూర్తి, బాపూజీ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కులగణనను సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టాకే కేంద్రంలో కదలిక వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర కమిటీ కార్యదర్శి డి.వెంకటేష్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధానకార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు తమగొండ రాజ్‌దీప్, జనిగే శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ నియోజకవర్గం బీ-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్, నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ ముదిరాజ్, లింగంగుప్తా పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ..

ముషీరాబాద్‌లోని శివాలయం చౌరస్తా వద్ద గల రేషన్‌షాపులో లబ్ధిదారులకు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ సన్నబియ్యం పంపిణీ చేశారు. రేషకార్డు లబ్ధిదారులతో సన్నబియ్యం ఎలా ఉన్నాయి? సీఎం రేవంత్‌రెడ్డి అందజేస్తున్నారని వారితో ఎంపీ మాట్లాడారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు.

● **రాంనగర్:** పేదలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పేద ప్రజలకు సన్నబియ్యం ఇస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని తెలిపారు. రాంనగర్ డివిజన్‌లోని దయార మార్కెట్‌లో గల 638 రేషన్ షాపులో ఆదివారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రేషన్‌షాపుల్లో సన్నబియ్యం ఇస్తున్న నేపథ్యంలో మార్కెట్‌లో బియ్యం ధరలు కిలోకు పది రూపాయల వరకు తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్ కాంగ్రెస్ నాయకులు లింగాల శ్రీకాంత్‌గౌడ్, అంజియాదవ్, పాశం అనిల్‌కుమార్‌యాదవ్, రాజు, పరకాల వేణుగౌడ్, సుదేష్, వెంకటేష్, శ్యామ్‌యాదవ్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి: ఉషశ్రీ

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయి నుంచి మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి అన్ని నియోజకవర్గాల్లో బూత్ స్థాయి నుంచి మహిళా కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఆదివారం అంబర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో ఖైరతాబాద్ జిల్లా పరిధిలోని అంబర్‌పేట, నాంపల్లి, కార్వాన్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో నిర్వహించిన మహిళాకాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ, మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబ, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాల మేరకు బూత్, డివిజన్ స్థాయిలో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్, కార్వాన్ ఇన్‌చార్జి ఉస్మాన్‌బాయ్‌తో చర్చించామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలను సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలి'

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు సత్వర పరిష్కారం అవుతాయని ఎస్సీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు కె.రాములు పేర్కొన్నారు. ఆదివారం చిక్కడపల్లిలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో పోస్టల్, ఆర్ఎంఎస్, ఎంఎంఎస్ నాల్గవ ద్వైవార్షిక రాష్ట్ర సదస్సు తెలంగాణ సర్కిల్ కన్వీనర్ ఎంఎస్.చలపతిగిరి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాములు మాట్లాడుతూ పోస్టల్‌శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సమయ పాలన పాటిస్తూ సంస్థపురోగతికి పాటుపడాలన్నారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ల ద్వారా నేడు ఉద్యోగాలు లభించాయని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఫణి రాజన్, బి.అంబేడ్కర్‌రాజ్, ఎస్.రాజారత్నం, డాక్టర్ ఎం.ఆంజనేయులు, జి.నర్మద, యాదయ్య పాల్గొన్నారు.

నెల రోజులుగా తాగునీటి ఇబ్బందులు

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో గాంధీనగర్ డివిజన్ వాల్మీకినగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, వీవీగిరినగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నాలుగున్నర గంటలకు నల్లాల్లో తాగునీరు వదలాల్సిన లైన్‌మెన్‌లు 6 గంటల వరకు కూడా వదలడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం 4.30 గంటలకు హాస్టల్‌ళ్లు, అపార్ట్‌మెంట్‌లు ఉన్న ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసి, తర్వాత వదలడంతో సరిపోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వాల్మీకినగర్, వీవీగిరినగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌వాసులకు లోప్రెషర్ ఉంటుందన్నారు.